జూలో పాత్‌వేల విస్తరణ



గూడ బాతుల కొలను వద్ద జరుగుతున్న పాత్ వే నిర్మాణ పనులు



బెంగాల్ టైగర్స్ ఎన్‌క్లోజర్ నుంచి తెల్ల పులులు ఎన్‌క్లోజరు వరకు వెడల్పు చేసిన పాత్‌వే

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో సందర్శకుల సౌలభ్యం కోసం అధికారులు పాత్‌వేల విస్తరణ పనులు చేపట్టారు. జూ ప్రారంభ సమయంలో వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద అప్పట్లో పాత్‌వేలు నిర్మించారు. మొదట్లో జూకు వెళ్లే సందర్శకులు సంఖ్య తక్కువగా ఉండేది. తక్కువ వెడల్పుతో ఉన్న పాత్‌వేలపై సందర్శకులకు నడవడానికి ఇబ్బంది ఉండేది కాదు. కొన్నేళ్లుగా ఇతర జూ పార్కుల నుంచి అధికారులు వివిధ వన్యప్రాణులను ఇక్కడకు తీసుకురావడం, అందుకు అనుగుణంగా ఎన్‌క్లోజర్ల సంఖ్య పెంచడంతో సందర్శకులు సంఖ్య గణనీయంగా పెరిగింది. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, సెలవు రోజులు, కార్తీక మాసం, సంక్రాంతి, దసరా తదితర పర్వదినాల్లో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఆయా రోజుల్లో వేల సంఖ్యలో జూ పార్కును సందర్శిస్తుంటారు. దీంతో ఎన్‌క్లోజర్ల వద్ద ఉన్న చిన్న పాత్‌వేలపై నిల్చుని వన్యప్రాణులను చూడడానికి ఇబ్బందవుతోంది. సమస్యను గుర్తించిన అధికారులు.. సందర్శకుల సౌకర్యార్థం ఎన్‌క్లోజర్ల పాత్‌వేలను విస్తరించే పనులు చేపట్టారు. కొద్ది రోజులుగా ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బెంగాల్ టైగర్స్ నుంచి తెల్ల పులుల ఎన్‌క్లోజర్ల వరకు పాత్‌వేను వెడల్పు చేస్తున్నారు. దీంతో పాటు గూడ బాతుల కొలను చుట్టూ కొత్తగా పాత్‌వే నిర్మాణం చేపడుతున్నారు. పలు ఎన్‌క్లోజర్ల సమీపంలో సందర్శకుల కోసం అందుబాటులో ఉన్న మరుగుదొడ్లకు వెళ్లే రహదారులను వెడల్పు చేస్తున్నారు. జూలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తెల్ల పులుల ఎన్‌క్లోజర్ ఎదురుగా సందర్శకుల మరుగుదొడ్ల వద్ద విస్తరించిన పాత్‌వే

క్లుప్తంగా

నేడు 'విటమిన్-డీ' పరీక్షలు

ఆరిలోవ: జీవీఎంసీ వదో వార్డు రవీంద్రనగర్‌లో సేవా స్ఫూర్తి అసోసియేషన్ భవనంలో మహిళలకు ఆదివారం విటమిన్-డీ పరీక్షలు చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో డయాగ్నోస్టిక్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బయట ఈ పరీక్షలకు రూ.1850 ఖర్చు అవుతుందని, ఇక్కడ రూ.199కే చేయనున్నట్టు తెలిపారు. ఎముకలకు సంబంధించిన ఈ పరీక్ష మహిళలకు చాలా అవసరమని, ఉదయం 9 నుంచి ఈ శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవితేజ, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ఎండోక్రోనాలజీ(ఏసీఈ) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డయాబెటీస్, నేత్ర సమస్యలు, థైరాయిడ్, బీపీ, తదితర సమస్యలపై ఉచితంగా పరీక్షలు, వైద్యం చేసినట్టు ఏసీఈ ఎండీ డాక్టర్ రవితేజ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో 100 మందికి పైగా చికిత్స పొందారు.

ఘనంగా మహిళా దినోత్సవం



సర్టిఫికెట్లతో విశాఖ అండ్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ మహిళలు

ఆరిలోవ: విశాఖ అండ్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరిలోవలో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీలో మహిళలకు కోలాటం, థింసా నృత్యం, నాటిక పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సొసైటీలో ఉత్తమ సేవలు అందించిన మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో 10, 12 వార్డుల కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మి, అక్కరమాని రోహిణి, రెవరెంట్ మల్లవరపు ప్రకాష్, సెయింట్ ఆన్స్ ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ పాండ్రిన, సిస్టర్ నిర్మల, న్యాయవాది అయ్యర్ మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

'ఓటర్లను ప్రలోభ పెట్టలేరు'



మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు తదితరులు

ఎంవీపీ కాలనీ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను వెండి బిస్కెట్లతో ప్రలోభ పెట్టాలనుకోవడం అవివేకమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు అన్నారు. శనివారం ఆయన లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు చెందిన ఇంట్లో వెండి బిస్కెట్‌లతో కూడిన గిఫ్ట్ ప్యాక్‌లు బయటపడడం శోచనీయమన్నారు. ఈ ఘటనపై ప్రతిపక్ష పార్టీలు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. సమ్మిట్ పేరిట వేలాది ఎకరాల భూదందాకు ప్రభుత్వం కుట్రపన్నిందని ఆరోపించారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు రెవెన్యూ ఉద్యోగులు

మహారాణిపేట: కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది నిరసనలో భాగంగా శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.వి.రమేష్, ఇతర నాయకులు రాజేంద్ర వర్మ, నాల్గో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 9న హెచ్‌ఆర్‌సీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మంత్రి శ్యాంప్రసాద్

దాబాగార్డెన్స్: ఏప్రిల్ 9న దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల కౌన్సిల్(హెచ్‌ఆర్‌సీ) సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో భాగంగా మానవ హక్కుల పరిరక్షణలో పౌరుడి పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని ఆహ్వానించి వారి సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు. సర్వసభ్య సమావేశానికి హైకోర్టు న్యాయమూర్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటుతో పాటు రాష్ట్ర గవర్నర్‌గా నియమితుడైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు మానవ హక్కుల పటిష్టతకు చేపట్టాల్సిన చర్యపై నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జూలై నాటికి 25 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌లు, సభ్యులను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. హక్కుల ఉల్లంఘనతో బాధితులైన వారి హక్కుల పరిరక్షణకు 25 ఏళ్లుగా కౌన్సిల్ పోరాడుతోందన్నారు. బాలలు, మహిళల హక్కులు, పర్యావరణ హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రాజకీయాలకతీతంగా హక్కుల పరిరక్షణకు శ్రమిస్తున్న వారిని మాత్రమే తమ సంస్థ ప్రోత్సహిస్తుందన్నారు. సమావేశంలో వీఎస్ఎన్ మూర్తి, ఎస్‌వీ రమణ, అబ్దుల్ సత్తార్, రావాడ నాయుడు, మాధవి గణపతి, నక్కాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: ఉగాది విశిష్ట ప్రతిభారత్న-2023 పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సర్వేజనా సుఖినో భవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పల్లెలు, పట్టణాల్లో ఉన్న కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ఉగాది విశిష్ట ప్రతిభా రత్న పురస్కారంతో ఈ నెల 26న హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న వారు తమ ప్రతిభను గురించి తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్.. గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేసి ఈ నెల 20వ తేదీలోగా సర్వేజనా సుఖినో భవంతు, 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96523 47207 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.


ఎమ్మెల్సీ అభ్యర్థుల ముఖాముఖి నేడు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆడారి కిషోర్‌కుమార్

సీతంపేట: ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉత్తరాంధ్ర విద్యావంతుల వేదిక కన్వీనర్ ఆడారి కిషోర్‌కుమార్ తెలిపారు. పబ్లిక్ లైబ్రరీలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహాయత వెల్ఫేర్ సొసైటీతో కలిసి మొదటిసారిగా ఎన్నికల బరిలో పోటీపడుతున్న అభ్యర్థులతో ఓపెన్ డిబేట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్న అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సుమారు 38 మంది పాల్గొంటారని వెల్లడించారు. వారంతా తమ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఈ చర్చా వేదికపై నుంచి కార్యాచరణ వివరిస్తారన్నారు. ముందుగా కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో జ్ఞానానంద, వెంకటేష్, శ్రీధర్, వంశీ, అసిత పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బీసీలకు సామాజిక న్యాయం



బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు రాష్ట్రంలో పూర్తి స్థాయి సామాజిక న్యాయం జరుగుతోందని బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎన్నడూ జరగని విధంగా ప్రస్తుతం రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి సీఎం పాటు పడుతున్నారన్నారు. బీసీలకు రాష్ట్రంలో సముచిత స్థానం కల్పిస్తున్న సీఎం జగన్‌కు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని గెలిపించి కానుకగా ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉత్తరాంధ్ర బీసీ పట్టభద్రులపై ఉందని వెల్లడించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

సింహాచలం: కుటుంబ గొడవలతో మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనకు సంబంధించి పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు.... పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన బాడంగి రాజు(24) బైక్ ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది ఏప్రిల్‌లో నగరంలోని దాబాగార్డెన్స్‌కు చెందిన ధనలక్ష్మితో వివాహం జరిగింది. తల్లి, భార్యకు తరచూ గొడవలు జరుగుతుండడంతో వారికి సర్దిచెప్పలేక పోయాడు. ఈ తరుణంలో భార్యతో కలిసి వేరే కాపురం పెట్టాడు. కాగా భార్య ధనలక్ష్మి డెలివరీ కోసం రెండునెలల కిందట పుట్టింటికి వెళ్లింది. అత్త తనను తరచూ వేధింపులకు గురిచేస్తోందని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అప్పటి నుంచి రాజు పనిమానేసి మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి పడుకున్న రాజు శనివారం మధ్యాహ్నం 12 గంటలవుతున్నా లేవకపోవడంతో తల్లి అతని ఇంటికి వెళ్లింది. ఎంత పిలిచా పలకకపోవడంతో స్థానికులు వచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరివేసుకుని రాజు ఉన్నాడు. వెంటనే పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న లా అండ్ ఆర్డర్ ఎస్ఐ సురేష్ పరిశీలనచేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు.

గీతంలో హ్యాక్‌థాన్

కొమ్మాది: కంప్యూటర్ సైన్స్ కోర్సు అభ్యసించే విద్యార్థుల్లో కోడింగ్‌పై గల నైపుణ్యాలను ప్రోత్సహించడానికి గీతంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగు విభాగం, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా శనివారం కోడ్ పర్‌సూయ్ట్ పేరిట హ్యాక్‌థాన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి ఆర్.శిరీష మాట్లాడుతూ ఐటీ రంగంలో కోడింగ్‌కు గల ప్రాధాన్యత దృష్ట్యా విద్యార్థులు సంబంధిత అంశాలపై లోతైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రాంగణ నియామకాల్లో విద్యార్థులు ఎంపికయ్యేందుకు కోడింగ్ సామర్థ్యం కీలకమన్నారు.

మధురవాడలో విస్తృత తనిఖీలు



కొమ్మాదిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

మధురవాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. శనివారం సాయంత్రం మధురవాడ పరిసర ప్రాంతాలు, కొమ్మాది జంక్షన్‌లో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సునీత తదితరుల ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేశారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



గుడ్లవానిపాలెం వద్ద పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

కొమ్మాది: జి - 20 సదస్సు కోసం బీచ్ రోడ్డులో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా గుడ్లవానిపాలెం అమ్మవార్ల దేవాలయం సముదాయం, సాగర్‌నగర్, ఇస్కాన్ టెంపుల్ జంక్షన్, రాడిసన్ బ్లూ హోటల్ తదితర సాగరతీర ప్రాంత వ్యూ పాయింట్ల వద్ద జరుగుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. గుడ్లవానిపాలెం వద్ద జరగుతున్న పనుల నాణ్యతను పరిశీలించి టూవీలర్, ఫోర్ వీలర్ పార్కింగ్, పచ్చని మొక్కల పెంపకం, సందర్శకులు కూర్చునేందుకు ఆధునిక బెంచీల ఏర్పాటు, ఓపెన్ జిమ్, పిల్లల ఆట పరికరాలు ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తీర ప్రాంతాల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, పది మంది గ్రీన్ అంబాసిడర్లను నియమించి సందర్శకులు వ్యర్థాలు బీచ్‌లో పడవేయకుండా నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. టూరిస్టు బస్సులను పద్ధతి ప్రకారం పార్కింగ్ చేయకపోతే అపరాధ రుసుం విధించాలని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మిని ఆదేశించారు. అనంతరం సాగర్‌నగర్ బీచ్ పాయింట్ వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. మేజర్ డ్రైనేజీలో సిల్ట్ తీసివేసి, చుట్టూ మొక్కలు అమర్చి అందంగా తీర్చి దిద్దాలని ఆదేశించారు. ఎలక్ట్రికల్ విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ రోప్ లైట్లను అందంగా అమర్చాలని తెలిపారు. సాగరతీరం వెంట నిర్దేశించిన వ్యూ పాయింట్లలో ఆహ్లాదం కలిగించేలా పచ్చదనం పెంపొందించడం, పారిశుధ్య నిర్వహణ, ప్రాంతాలను తెలిపే సూచిక బోర్డుల ఏర్పాటు పనులు మరో రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈలు శ్యాంసన్‌రాజు, వినయ్‌కుమార్, డీడీహెచ్ ఎమ్.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి వంట పాత్రల వితరణ



సామగ్రిని టీటీడీ అధికారికి అందిస్తున్న దాతలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ రామారావు రూ.1.25 లక్షల విలువ చేసే ఫ్రిడ్జ్, గ్రైండర్, 41 రకాల వంట పాత్రలు శనివారం టీటీడీ అధికారులకు అందజేశారు. శ్రీవారి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఇవి అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శేషుబాబు, భ్రమరాంబిక సేవా సమితి కో ఆర్డినేటర్ పి.విజయ, పీవీఎస్ఎమ్ రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభ శనివారం మద్దిలపాలెంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. తొలి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ రిజిస్ట్రార్ కె.ఎస్.కోటేశ్వరరావు, జ్యోతీశ్వరరావు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, పడాల రమణ, జగన్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

14న సత్తమ్మతల్లి జాతర

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తమ్మతల్లి వార్షిక జాతరను ఈ నెల 14న నిర్వహించనున్నట్టు ఆలయ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు ఒక కార్యక్రమంలో తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నసమారాధన చేస్తున్నట్టు చెప్పారు.

పల్లకీలో జంట.. కనుల పంట



ఎంవీపీకాలనీ: ఓ నవ జంట శనివారం పల్లకీలో ఊరేగుతూ కనువిందు చేసింది. సాధారణంగా పల్లెటూరులో ఇటువంటి కమనీయ దృశ్యాలు కనిపిస్తాయి. నగరంలోని అప్పుఘర్‌లో బంధుమిత్రుల పరివారంతో పల్లకీలో ఊరేగుతున్న ఈ నవ జంటను చూసేందుకు వాహనచోదకులు, స్థానికులు ఉత్సాహం చూపించారు.

అధ్యాపకుడు రామారావుకు రెండు అవార్డులు



కృష్ణా కళాశాల అధ్యాపకుడు రామారావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కర్రి రామారావుకు అంతర్జాతీయ సైన్స్ జర్నల్స్ నుంచి రెండు అవార్డులు లభించాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ రామారావును శనివారం అభినందన కార్యక్రమంలో సత్కరించారు. జర్నల్ ఆఫ్ జువాలజీ సైన్స్ నుంచి ఒక అవార్డు, ఉత్తరప్రదేశ్ జర్నల్ ఆఫ్ జువాలజీ నుంచి మరో అవార్డు లభించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు శ్యామ్యూల్ డేవిడ్‌రాజు, రత్నభారతి, పి.ఆర్.వాణి, ఉమామహేశ్వరరావు, అప్పారావు, గోపి, రాజారావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎం హెచ్‌వో జగదీశ్వరరావు

బీచ్ రోడ్డు: క్యాన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జగదీశ్వరరావు సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, భవిష్యత్తులోనూ అది కొనసాగాలని ఆకాంక్షించారు. రోజురోజుకూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రాథమిక దశ రాక ముందే జాగ్రత్త పడాలన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న పలువురు మహిళలను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా శ్రీనృసింహ హోమం



కలశంతో ప్రదక్షిణ చేస్తున్న పురోహిత్ అలంకారి

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున లోక కల్యాణార్థం నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా శనివారం స్వాతి నక్షత్రం కావడంతో నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. తొలుత చక్ర పెరుమాళ్లను ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణమండపం వద్దకు తీసుకొచ్చి హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ విశేషంగా నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని పురోహిత్ అలంకరి కరి సీతారామాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నర్సింగ్ వృత్తితో ఆత్మసంతృప్తి

కొమ్మాది: నర్సింగ్ వృత్తికి వైద్య రంగంలో ప్రపంచ వ్యాప్తంగా అధిక డిమాండ్ ఉందని, అదే సమయంలో మనిషి ప్రాణాలు కాపాడుతున్నామన్న ఆత్మసంతృప్తి లభిస్తుందని యూకేలోని లండన్ రాయల్ బ్రాంప్టన్ వైద్యాలయం నిపుణురాలు అనురాధ అన్నారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో 'నర్సింగ్ వృత్తి - అవకాశాలు' అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. నర్సింగ్ వృత్తిలో రాణించాలంటే అంకితభావం, రోగుల పట్ల శ్రద్ధ, సేవానిరతి, చక్కటి భావప్రకటన సామర్థ్యం అవసరమని ఆమె సూచించారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు

అల్లిపురం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలికను టూటౌన్ పోలీసులు సకాలంలో స్పందించి రక్షించిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టూటౌన్ పరిధిలో మనోరమా థియేటర్ వెనుకవీధిలో నివాసం ఉంటున్న ఓ మహిళ.. పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ డయల్ 112కి శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఫోన్ చేసి, తన కుమార్తె ఒక గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని, ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తుందని చెప్పింది. ఈ మేరకు సమాచారం అందుకున్న నైట్ బీట్ సిబ్బంది టి.జాన్ జయరాజ్, హోంగార్డు వి.శేఖర్, మొబైల్ ఇన్‌చార్జ్ కె.శ్రీనివాసరావుతో కలసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. గది తలుపులు విరగ్గొట్టి బాలికను రక్షించారు.
కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం ఆమెను టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ మహిళా సెల్టర్‌లో చేర్పించారు. సకాలంలో స్పందించి బాలిక ప్రాణాలు కాపాడిన సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అభినందించారు.